## 660

ప॥ దొరుకుతావురా సహోదరా! దొరుకుతావురా; నీవు
తరిమి తరిమి కీడుచేయ - పరుగులెత్తినగాని తుదకు ॥దొ॥

1. చిన్న చూపు చూచి తమ్ముని- కన్నెఱుంగక చంపినగాని
అన్న కయీను దేవుని - హస్తమునకు దొరికిన రీతిగా ॥దొ॥

2. వరములొందిన తమ్ముని - జంప-వలయునని పంతముగబట్టి
నరకవచ్చిలోబడి యేడ్చిన - దురిత చరితుని యేశావువలె ॥దొ॥

3. భక్త దావీదును బట్టి - ప్రాణము దీయగ దలచిన తన
శక్తితో తరిమిన రాజగు -సౌలు దొరికినరీతిగాను ॥దొ॥

4. విగ్రహమునకు మ్రొక్కని దైవ - పిల్లల నగ్నిలోపడవైచి
ఆగ్రహించిన నెబుకద్నెజరు - గడ్డిమేసి దొరికిన విధముగ ॥దొ॥

5. క్రైస్తవులను బట్టి కొట్టి - ఖైదులో వేయదలచినను
వాస్తవమగు వెలుగును జూచి -ప్రభుని చాటిని పౌలుబోలి ॥దొ॥

6. కీడుచేయబోకు మెపుడు - కీడు నీకే కీడు కీడు
కీడు చేసినమేలుచేసి - కీడును జయింపకపోతే ॥దొ॥

7. మాటలు కుదిరితే మాటలు - కోటలు కుదురును నీకు
మాటలలో లోటుంటే - నోటిమాట తప్పకుండ ॥దొ॥

8. దొంగతనము వ్యభిచారమునకు - లొంగి శాపగ్రస్తులునై
దొంగిలించిన దశమభాగమే - లొంగుట కారణమని తుదకు ॥దొ॥

9. కొంతయిచ్చిన దశమభాగ - మంత యిదియని తప్పుకున్న
కొంతయిచ్చిన కయీనువలె - కొంతయిచ్చిన అననియవలె ॥దొ॥

10. చెడుగుచేసి బదులు దానిని - చేసినారని చెప్పమన్న వడిగ
దేవుని న్యాయమనెడి - పరమత్రాసులో నిలువండి ॥దొ॥



## 661

ప॥ నడిపించు నానావ - నడిసాంద్రమున దేవా
నవజీవన మార్గమున - నాజన్మ తరియింప ॥నడిపించు॥

1. నా జీవిత తీరమున - నా యపజయ భారమున
నలిగిన నా హృదయమును - నడిపించు లోతునకు
నా యాత్మ విరబూయ - నా దీక్ష ఫలియింప
నా నావలో కాలిడుము - నా సేవ జేకొనుము ॥నడిపించు॥

2. రాత్రంతయు శ్రమపడినా - రాలేదు ప్రభు జయము
రహదారులు వెదకినను - రాదాయెను ప్రతిఫలము
రక్షించు నీ సిలువ - రమణీయ లోతులలో
రతనాలను వెదకుటలో - రాజిల్లు నా పడవ ॥నడిపించు॥

3. ఆత్మార్పణ చేయకయే - ఆశించితి నీ చెలిమి
అహమును ప్రేమించుచునే - అరసితి ప్రభు నీ కలిమి
ఆశ నిరాశాయే - ఆవేద నెదురాయే
ఆధ్యాత్మిక లేమిగని - అల్లాడె నావలలు ॥నడిపించు॥

4. ప్రభు మార్గము విడచితిని - ప్రార్థించుట మానితిని
ప్రభు వాక్యము వదలితిని - పరమార్థము మరచితిని
ప్రపంచ నటనలో - ప్రావీణ్యమును బొంది
ఫలహీనుడనై యిపుడు - పాటింతు నీమాట ॥నడిపించు॥

5. లోతైన జలములలో - లోతున వినబడు స్వరమా
లోబడుటను నేర్పించి - లోపంబును సవరించి
లోనున్న ఈవులలో - లోతైన నా బ్రతుకు
లోపించని యర్పణగా - లోకేశజేయుమయ ॥నడిపించు॥

6. ప్రభు యేసుని శిష్యుడనై - ప్రభు ప్రేమలో పాదుకొని
ప్రకటింతును లోకములో - పరిశుద్ధుని! ప్రేమకథ
పరమాత్మ ప్రోక్షణతో - పరిపూర్ణ సమర్పణతో
ప్రాణంబును ప్రభు కొరకు - పానార్పణము చేతు ॥నడిపించు॥